# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 28-10-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **బంగాళాఖాతంలోని మొంథా తుపాను ఈరోజు తీవ్రతుపానుగా బలపడుతుందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది.**

2. **మొంథా తుపాను దృష్ట్యా ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

3. **మొంథా తుపాను నేపథ్యంలో ధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఆదేశించారు.**

4. **ఆంధ్రప్రదేశ్‌లో 'మొంథా' తుపాను ప్రభావిత 12 జిల్లాలలో రేషన్ పంపిణీకి ఏర్పాట్లు చేశామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.**

5. **'మొంథా' తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు.**

=============================

బంగాళాఖాతంలోని మొంథా తుపాను ఉత్తర-వాయువ్య దిశగా ప్రయాణిస్తూ ఈరోజు తీవ్రతుపానుగా బలపడుతుందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈరోజు రాత్రికి మచిలీపట్నం, కాకినాడ మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు అతిభారీ వర్షాలు, రాయలసీమలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి కరుణాసాగర్ తెలియజేస్తూ,

వాయిస్ .. 26 సెకన్లు

-------------------------

మొంథా తుపాను దృష్ట్యా ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో ప్రజా ప్రకటన వ్యవస్థ -పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలోని మొంథా తుపాను పరిస్థితులు, ప్రభుత్వ చేపడుతున్న సహాయక చర్యలపై అధికారులతో ముఖ్యమంత్రి గత రాత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ... తుపానుపై రాష్ట్ర స్థాయిలో ఉన్న సమాచారం ఆధారంగా ఆర్టిజీ కేంద్రం నుంచి నేరుగా ఆయా ప్రాంతాలకు మైక్‌ల ద్వారా

అప్రమత్తం చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈరోజు నుంచి తుఫాను తీవ్రత పెరగనున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు తాజా సమాచారం ప్రజలకు అందించాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అలాగే మొంథా' తుపానుపై సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య సమాచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి అనిత సూచించారు. మొంథా తుపాను సన్నద్ధతపై అమరావతిలో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్.. 36 సెకన్లు

---------------------------

మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈ రోజు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన వానలు కురవడంతో పాటు ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. తెలంగాణలో తుపాను పరిస్థితిపై ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి రాష్ట్ర మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, మొంథా తుపాను నేపథ్యంలో ధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రైతులకు నష్టం జరగకుండా.. ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

---------------------------

మొంథా తుపాను ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ ప్రాంతంలో తీరం దాటనున్నదన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి కాకినాడ జిల్లా అధికారులతో దృశ్య మాధ్యమం విధానంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, జిల్లా పరిధిలోని 12 మండలాల్లో తుపాను ప్రభావం ఉండనున్న క్రమంలో ప్రభావిత ప్రాంతాల్లో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 'మొంథా' తుపాను ప్రభావిత 12 జిల్లాలలో రేషన్ పంపిణీకి ఏర్పాట్లు చేశామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఏలూరులో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆయా జిల్లాల్లో చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డు దారులకు నిత్యావసర సరుకులు ఈరోజు ఉదయం 9 గంటల నుండి అందిస్తామని చెప్పారు. తుపాను ముందస్తు చర్యల్లో భాగంగా రైతు సేవా కేంద్రాల్లో టార్పాలిన్లు ఉంచామని రైతులు వినియోగించుకోవచ్చని మంత్రి తెలియజేస్తూ

వాయిస్ .. 33 సెకన్లు

---------------------------

మొంథా తుపాను నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ప్రయాణికుల భద్రత దృష్ట్యా, రైళ్ల రాకపోకలపై ముందస్తు చర్యలు తీసుకున్నామని విజయవాడ రైల్వే అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ కె శ్రీనివాస రావు అన్నారు. విజయవాడలో నిన్న ఆయన మాట్లాడుతూ, విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో పలు రైళ్లను రద్దు చేశామని, ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందు రైలు స్థితిని enquiry.indianrail.gov.in వెబ్ సైట్‌లో

పరిశీలించుకోవాలని సూచించారు. తుఫాను తీవ్రతను బట్టి తరువాత సర్వీసులను పునరుద్ధరిస్తామని తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లోని రైల్వే స్టేషన్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. రైలు ట్రాక్‌లు, వంతెనలపై నిరంతరం పెట్రోలింగ్ బృందాలు పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు.

అలాగే విజయవాడ–విజయవాడ–విశాఖపట్నం– విమానాశ్రయాల నుండి నడిచే పలు విమాన సర్వీసులను కూడా చేశారు.

----------------------------

'మొంథా' తుపాను దృష్ట్యా 17 జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రసవానికి దగ్గరగా ఉన్న సుమారు 787 మంది గర్భిణిలను సమీప ఆసుపత్రులకు తరలించామని మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి వైద్య శిబిరంలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి, ఆరోగ్య కార్యకర్తలను నియమించినట్లు పేర్కొన్నారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా తాడేపల్లిలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో ఉన్న స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్‌ను కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గత సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,

వాయిస్.. 33 సెకన్లు

----------------------------

మహారాష్ట్రలోని ముంబైలో ఈరోజు నుంచి 2 రోజుల పాటు "ఇండియా మారిటైమ్ వీక్ – 2025" జరగనుంది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పాల్గొననున్నారు. కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ నేతృత్వంలో నిర్వహిస్తోన్న ఈ సమావేశంలో భాగంగా మారిటైమ్ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన ప్రాజెక్టులు, భవిష్యత్తు విధానాలు, పోర్టులు, షిప్పింగ్, లాజిస్టిక్స్, పర్యాటకం, అనుబంధ రంగాలలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను మంత్రి వివరించనున్నారు.

=====================